
# ఆ రాత్రి...!?!

కథా నిలయం
శ్రీకాకుళం

- అవీస్



"సమగ్రా! నా మాట వినమ్మా"

"అబ్బా! ఏంటమ్మా నీ గోల, కాసేపు ఊరుకుంటావా" మేగజైన్ పక్కన పడేసి తల్లి వైపు విసుగ్గా చూసింది సమగ్ర.

"ఏంటే అలా అంటావ్, అత్తకి ఒంట్లో బావుండకపోతే ఆమాత్రం చూడ్డానికి వెళ్ళవా ఏంటి?"

"వెళ్ళనని నేను అన్నానా, కాకపోతే డాడి వస్తే ఇద్దరం కలిసి వెళ్తాం అన్నాను. దాంట్లో తప్పేముంది?"

"తప్పేముందా? మీ డాడి ఆఫీస్ పని మీద ఊరెళ్తే ఎప్పుడొస్తారో ఆయనకే తెలీదు. అప్పటివరకు నువ్విలా మొండికేసి కూర్చుంటే ఎలా? అవతల అత్తకి ఎలా వుందో ఏంటో...?"

సమగ్ర ఆ ఇంటికి ఏకైక సంతానం. గారాబంగానే పెరిగింది. డిగ్రీ పాసవ్వగానే తండ్రి పెళ్ళిచేస్తానంటే ఒప్పుకోకుండా ఎమ్.బి.ఏ.లో చేరింది. తెలివితేటల్లో తండ్రికి ఏమాత్రం తీసిపోదు. అందంలో అప్సరస కాకపోయినా చూడ్డానికి చక్కగా వుంటుంది. అన్ని పనులు బాగానే చేస్తుంది. అల్లరి కూడా!

తూర్పుగోదావరి జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో ఉంటున్న వాళ్ళ అత్తయ్యకి ఒంట్లో బావుండలేదని రాత్రి ఫోన్ వచ్చింది. 'నాన్నగారు వచ్చాక మేం ఇద్దరం కలిసి వస్తాం. ఈలోపు నువ్వు ఒక్కసారి వెళ్ళి చూసిరా' అని తల్లి చెప్పడంతో సమగ్రకి చాలా విసుగ్గా అనిపించింది. అందుకే తల్లితో తగాదా మొదలుపెట్టింది.

"అమ్మా! అసలే ఆడ పిల్లని, పైగా ఒంటరిగా అంత దూరం వెళ్ళిరావడం... నువ్వే ఆలోచించు" అమాయకంగా ముఖంపెట్టి గారాలు పోయింది.

**ఉగాది పోటీలో ఎంపికైన కథ**

"నువ్వు ఆడపిల్లవా? ఫ్రెండ్స్‌తో కలిసి రోజూ ఊరుమీద బలాదూర్ తిరుగుతుంటావ్. పైగా పిక్నిక్‌లని, టూర్లని దేశమంతా తిరుగుతుంటావ్. నీకన్నా ఇంకా అబ్బాయిలు నయం. కనీసం వారానికి ఒక్కరోజైనా ఇంటి పట్టునుంటారు. నోర్మూసుకొని బయలుదేరు."

"ఫ్రెండ్స్‌తో కలసి ఎక్కడికైనా వెళ్ళడం వేరు... కాని ఇప్పుడు ఒంటరిగా అంటే... బోర్ బోర్".

"ఏంటే అత్తయ్యని చూడ్డానికి వెళ్ళడం నీకు బోర్‌గా అనిపిస్తుందా? నీకు బాగా పొగరెక్కిందే..." తల్లి మాటలకి మధ్యలో అడ్డుపడింది.

"అబ్బా తల్లీ! కాస్త ఊరుకుంటావా? ఏదో చిన్న పిల్లని, తెలీక ఏదో అన్నాను. దానికంత రాద్ధాంతం ఎందుకు."

"నువ్వు చిన్న పిల్లవా? కాదు...కాదు... చిన్న సైజు పిశాచానివి" తల్లి మాటలకి పకపకా నవ్వేసింది సమగ్ర.

"సర్లే అమ్మా! ఇంక ఈ గొడవంతా ఎందుకు గాని ఈరోజే బయలుదేరుతాను. అయినా అత్తంటే నాకు మాత్రం ఇష్టం లేదా ఏంటి" బుంగమూతి పెట్టింది.

"మొత్తానికి ఒక సమస్య తీరిపోయింది. ముందు త్వరగా స్నానం చెయ్యి. ఈలోపు నేను బట్టలు సర్దుతాను."

"మాతా! నువ్వేమీ నా బట్టలు సర్దక్కర్లేదు. అదేదో నేను చూసుకుంటాను. ముందు టిఫిన్ సంగతి చూడు" ఆవలిస్తూ సోఫాలోంచి లేచింది సమగ్ర.

అరగంటలో నీటుగా తయారై టిఫిన్ తినడం కూడా పూర్తిచేసింది.

"అవునే సమగ్రా! ఇంతకీ ఏ ట్రైన్‌లో వెళ్తావే" తల్లి మాటలకి తలెత్తి సీరియస్‌గా చూసింది.

"ఏంటే అంత సీరియస్‌గా చూస్తావ్. అయినా ఇప్పుడు నేను ఏమన్నానని..."

"రిజర్వేషన్ లేకుండా ట్రైన్‌లో... జనరల్ కంపార్ట్‌మెంట్‌లో వెళ్ళమంటావా?"

"అయితే ఇప్పుడేమంటావే?"

"ఇంకేమంటాను, ఏదో బస్సెక్కి తగలడతాను" హైహీల్స్ వేసుకుంటూ కోపంగా సమాధానమిచ్చింది.

"నీకీ మధ్య కోపం బాగా ఎక్కువవుతుందే... కాస్త తగ్గించుకో"

"అలాగే తల్లి, అలాగే... ముందు నువ్వు జాగ్రత్త! ఏదైనా అవసరమైతే నా ఫ్రెండ్ శ్రావణికి ఫోన్ చెయ్" బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ అంది.

"అది సరేలే... నువ్వు బస్సెక్కేముందు అత్తయ్యకి వస్తున్నట్టు ఫోన్ చెయ్... అన్నట్టు సెల్ తీసుకెళ్తున్నావు కదా!" తల్లి మాటలకి విసుగ్గా తలాడించి హైహీల్స్ టకటకలాడించుకుంటూ బయటకి అడుగుపెట్టింది.

* * *

నాలుగు రోడ్ల జంక్షన్‌లో సమగ్ర బస్సు దిగే సమయానికి టైం రాత్రి ఎనిమిదిన్నరవుతోంది.

అసలే చలికాలం. పైగా దట్టమైన చీకటి.

సమగ్ర కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ చుట్టూ పరిశీలనగా చూసింది. ఎక్కడా ఆటోలు కన్పించలేదు. కనీసం రిక్షా కూడా లేదు.

"షిట్! ఏంటి ఇలా బుక్ అయ్యాను. పైగా అత్తయ్యకి బస్సెక్కేముందు ఫోన్ చెయ్యడం కూడా మర్చిపోయాను." గాఢంగా నిట్టూర్చింది.

నిమిషం తర్వాత దగ్గరలో ఉన్న బడ్డీకొట్టుని సమీపించింది.

"చిన్న హెల్ప్ కావాలి" పొలైట్‌గా ప్రశ్నించింది.

"చెప్పండమ్మా" అంతే పొలైట్‌గా సమాధానమిచ్చాడు కొట్టు యజమాని.

"దుర్గాపురం వెళ్ళడానికి ఆటోలు ఏమైనా దొరుకుతాయంటారా?"

"ఆటోలా? ఈ టైంలోనా... లేదమ్మా! ఆరు దాటితే ఆ రోడ్డువైపు ఎటువంటి ఆటోలు తిరగవ్."

"అలాగా... కనీసం రిక్షాలేమైనా దొరుకుతాయా?"

ఆమె కంఠంలో ధ్వనించిన ఆతృత కొట్టువాడు స్పష్టంగా గమనించి తల అడ్డంగా తిప్పాడు.

సమగ్ర అసహనంతో నొసలు చిట్లించింది.

ఏమిచెయ్యాలో తెలీక చుట్టూ చూసింది.

దూరంగా హైవేపై పోతున్న వెహికల్స్ కన్పించాయి.

ఆకాశం నిర్మలంగా వుంది.

ఆ ప్రాంతమంతా దాదాపు నిశ్శబ్దంగా వుంది.

ఇంతలో బడ్డీకొట్టువాడు షాపు మూయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. 'సరే! అత్తయ్య వాళ్ళకి ఫోన్ చేసి చూద్దాం' మనసులో అనుకొని బ్యాగ్‌లోంచి సెల్ ఫోన్ బయటకు తీసింది.

'ఇంతకీ కవరేజ్ వుందో, లేదో' అనుకుంటూ సెల్‌ని ఆన్ చేసింది.

కాని సెల్ సరిగ్గా పనిచెయ్యట్లేదు.

ఆమెకి అర్థమైంది- సెల్ చార్జింగ్ అయిపోయింది.

నీరసంగా ముఖంపెట్టి సెల్‌తో నుదురు రుద్దుకుంది.

సమగ్రకి చాలా విసుగ్గా వుంది. తనకి ఈ పరిస్థితి రావడానికి కారణమైన తల్లిమీద విపరీతమైన కోపం వచ్చేసింది. 'అంతా నీవల్లే వచ్చింది. ఇంటికి రాగానే నిన్ను ఏంచేస్తానో చూడు' మనసులో తల్లిని తిట్టుకుంది.

ఆ జంక్షన్‌లో స్ట్రీట్ లైట్స్ దాదాపు వెలగడం లేదు.

బడ్డీకొట్టువాడు దాదాపు షాపు మూసేసాడు. తాళం వేస్తుండగా సమగ్ర ఆదుర్దాగా ప్రశ్నించింది.

'దయచేసి నేను దుర్గాపురం చేరడానికి మీరేదైనా హెల్ప్ చెయ్యగలరా? ప్లీజ్..." ఆమె ముఖంలోని నిస్సహాయతకి అతడు జాలిపడ్డాడు.

"లేదమ్మా! నేనేమీ చెయ్యలేను... అయినా మీలాంటి ఆడ పిల్లలు ఇంత రాత్రివేళ రావడమే తప్పు. పైగా ఆటోలు నడవని టైంలో.. ఏం చెయ్యాలో నాకూ తోచడం లేదు..." అతడు ఆలోచనలో పడ్డాడు.

"దుర్గాపురానికి నడిచి వెళ్తే ఎంత టైం పడుతుంది?"

"ఎంత లేదన్నా ముప్పావుగంట పడుతుందమ్మా... ప్రస్తుతానికి నడిచి వెళ్ళడం తప్ప మరో మార్గం కన్పించడం లేదు" షాపుకి తాళం వేయడం పూర్తిచేస్తూ సమాధానమిచ్చాడు బడ్డీకొట్టు యజమాని.

"ఓ గాడ్! వాట్ ఏ పనిషిమెంట్, ఇట్స్ హారిబుల్. ఈ చీకట్లో నడిచి వెళ్ళడమంటే..." ఆపై ఆలోచించడానికి మనసొప్పక విసుగ్గా హైహీల్స్‌తో నేలని తన్నింది.

వాతావరణం చాలా చల్లగా ఉంది.

ఉండి ఉండి చలిగాలులు వీస్తున్నాయి.

"సరే, నేను నడిచే వెళ్తాను. చాలా థ్యాంక్స్!" సమగ్ర వెనక్కి తిరిగి దుర్గాపురం వెళ్ళే రోడ్డువైపు అడుగులేసింది.

రోడ్డంతా దాదాపు చీకటిగా వుంది. దానికితోడు అంతా గతుకుల మయం. తొందరగా నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి.

'ఈరోజు నాటైం బాగోలేదు... లేకపోతే ఏమిటిదంతా? వెళ్ళడానికి ఆటోలు లేకపోవడం, ఆపై సెల్ ఫోన్ చార్జింగ్ అయిపోవడం... అయినా తను ఎంత సేపూ తన గురించే ఆలోచిస్తుంది, అత్త గురించి అస్సలు ఆలోచించడం లేదు. పాపం! అత్తయ్య హెల్త్ కండీషన్ ఎలా వుందీ ఏమిటీ? తనంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు తననెప్పుడూ దగ్గరే ఉంచుకునేది... అయినా చీకట్లో ఇలా నడవటం అన్నది తను ఒక పనిష్మెంట్‌లా ఎందుకు భావించాలి. తనకిష్టమైన అత్తయ్యని చూడ్డానికి వెళ్ళడం తనకేమీ ఇబ్బంది కాదు. లైఫ్‌లో ఇష్టంలేని ఇన్సిడెంట్స్ ఎన్నో జరుగుతుంటాయి. అంతమాత్రానా...' ఆమె ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లు గాలికి అటూ ఇటూ ఊగుతూ జుత్తు విరబూసుకున్న దెయ్యాల్ని గుర్తుకు తెప్పిస్తున్నాయి.

ఆకాశంలో చంద్రుడు కురిపిస్తున్న మనక వెలుతురులో రోడ్డు అస్పష్టంగా కనిపిస్తోంది. బహుశా రాత్రి సమయంలో ఆ రోడ్డుపై ఎవరూ సంచరించరేమో!

చలిగాలికి ఒళ్ళు జలదరిస్తోంది.

సమగ్ర రెండు చేతులూ కట్టుకొని వడివడిగా అడుగులు వేస్తోంది.

చీకటి రాత్రి, నిశ్శబ్దం, ఆపై ఒంటరిగా ప్రయాణం.

'శ్రావణి! నువ్విప్పుడు తోడుగావుంటే ఎంత బాగుంటుంది. నీ కబుర్లు వింటూ వుంటే అసలు టైమే తెలీదు... యూ నాటీ గర్ల్' తన స్నేహితురాలిని తల్చుకొని భారంగా నిట్టూర్చింది.



ఈరోజు నాటైం బాగోలేదు... లేకపోతే ఏమిటిదంతా? వెళ్ళడానికి ఆటోలు లేకపోవడం, ఆపై సెల్‌ఫోన్ చార్జింగ్ అయిపోవడం... అయినా తను ఎంతసేపూ తన గురించే ఆలోచిస్తుంది. అత్త గురించి అస్సలు ఆలోచించడం లేదు. పాపం! అత్తయ్య హెల్త్ కండీషన్ ఎలా వుందీ ఏమిటీ?

అప్పటికి పావుగంట గడిచింది.

మసక చీకట్లో గతుకుల రోడ్డుమీద నడక అలవాటు కావడంతో సమగ్ర మరికాస్త వేగంగా నడవడం ప్రారంభించింది.

'ఎవ్వరూ తోడు లేకుండా ఈ చిమ్మ చీకట్లో ఇలా ఒంటరిగా నడుస్తూ వెళ్ళడం నిజంగా ఇట్స్ ఎ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్' ఆమె మనసులో నవ్వుకుంది.

కొంతసేపటి తర్వాత తనెందుకో అనీజీగా ఫీలవ్వడం ప్రారంభించింది.

తనని ఎవరో అనుసరిస్తున్నారన్న అనుమానం పట్టిపీడించసాగింది.

మొదటిసారి సమగ్రకి భయం వేసింది.

ఆమె నడకలో వేగం తగ్గిపోయింది.

అడుగులు భారంగా పడుతున్నాయి- బహుశా భయంవల్లనేమో!

'తను భ్రమపడుతుందా లేక నిజంగానే తననెవరో ఫాలో చేస్తున్నారా? అయినా తనని ఫాలో చెయ్యాల్సిన అవసరం ఎవరికుంది? తను ఎలా ధైర్యవంతురాలినని డాడీ అంటూ వుంటారు. అది నిజమే... అయినా తనసలు ఎందుకు భయపడుతుంది... నాన్సెన్స్!' సమగ్ర తల విదిలించి మొండిగా ముందుకి అడుగులు వేసింది.

కాని ఆమె స్థిమితంగా ఉండలేకపోయింది.

వెనుక ఎవరో నడుస్తున్న అడుగుల శబ్దం అస్పష్టంగా, భారంగా విన్పిస్తోంది. ఆమె చెవులు రిక్కించింది. 'భ్రమ కాదు నిజమే... ఎవరో తనని క్లోజ్‌గా ఫాలో చేస్తున్నారు. కొంపదీసి తన ఫ్రెండ్ శ్రావణి కాదుకదా! ఇట్స్ రెడిక్యులస్' నడుస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయింది. ఓ క్షణం అలాగే నిలబడిపోయింది.

వెనక అడుగుల శబ్దం కూడా ఆగిపోయింది.

నిర్మానుష్యమైన ఆ రోడ్డులో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

'ఇప్పుడేం చేస్తే బావుంటుంది?' ఆలోచనలో పడింది.

ఇక లాభం లేదనుకొని పెదాలు బిగించి గిరుక్కున వెనక్కి తిరిగింది.

సమగ్ర ముఖం తెల్లగా పాలిపోయింది.

కళ్ళు భయం వల్లనేమో కాస్త పెద్దవయ్యాయి.

గుండె కొట్టుకుంటున్న స్పీడ్ బాగా పెరిగింది.

ఎదురుగా- తెల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి నిల్చొని వున్నాడు.

వయస్సు నలభై అయిదు సంవత్సరాలుండొచ్చు.

చేతులు గాల్లో తేలుతున్నట్టు వ్రేలాడుతున్నాయి.

బుగ్గలు బాగా లోతుకి వెళ్ళిపోయాయి. పళ్ళు బాగా ఎత్తుగా వున్నాయి. గుంట కళ్ళు. అవి కూడా ఎర్రగా మెరుస్తున్నాయి.

ఆ వ్యక్తి తల కాస్త ప్రక్కకి ఒంచి సమగ్ర వైపే తదేకంగా చూస్తున్నాడు. గాలి హోరున వీస్తోంది. చంద్రుడు ఓ క్షణం మబ్బుల చాటుకి వెళ్ళిపోయాడు.

'ఎవరా వ్యక్తి? మనిషా లేక దెయ్యమా?' సమగ్ర గుండె ఝల్లుమంది.

ఎదురుగా వున్న వ్యక్తి ఇంకా తదేకంగా ఆమెనే చూస్తున్నాడు.

సమగ్ర ముఖానికి చిరుచెమటలు పట్టాయి.

చేతిలో ఉన్న కర్చీఫ్‌తో చెమట తుడుచుకుంది.

ఆమె గొంతు తడారిపోయింది.

'తను అనవసరంగా భయపడుతుందా? ఆ వ్యక్తి తనను ఎందుకలా చూస్తున్నాడు?' ఆమె ఆలోచనలు వేగంగా పరుగులు తీస్తున్నాయి.

అతి కష్టంమీద టెన్షన్‌ని కంట్రోల్ చేసుకుంది.

"ఎవరు నువ్వు?... నన్నెందుకు ఫాలో చేస్తున్నావ్?" గొంతు పెగల్చుకొని ప్రశ్నించింది. ఎదురుగా వున్న వ్యక్తి ఏమీ మాట్లాడలేదు.

మబ్బుల చాటునుండి చంద్రుడు బయటకొచ్చాడు.

మసక వెన్నెల్లో అతడి కళ్ళు మరికాస్త ఎరుపెక్కాయి.

"అడుగుతుంది నిన్నే, ఎవరు నువ్వు? నన్నెందుకు ఫాలో చేస్తున్నావ్?" ధైర్యాన్ని కూడదీసుకొని మళ్ళీ ప్రశ్నించింది.

ఆ వ్యక్తి ఏమీ సమాధానం చెప్పలేదు. కాని నవ్వేడు. అసలే ఎత్తు పళ్ళు, నవ్వుతుంటే మరి కాస్త ముందుకి పొడుచుకొచ్చి భయంకరంగా కన్పించాయి.

సమగ్రకి ధైర్యం ఒక్కసారిగా దిగజారిపోయింది.

భుజానికి వ్రేలాడుతున్న బ్యాగ్‌ని బిగించి పట్టుకుంది.

తనకి దెయ్యాలంటే నమ్మకం లేదు. కాని ఎదుటనున్న వ్యక్తిని చూస్తుంటే దెయ్యమేమోనన్న అనుమానం కలుగుతోంది. దెయ్యాలకి పాదాలు వెనక్కి తిరిగి వుంటాయంటారు. ఊపిరి బిగపెట్టి ఆ వ్యక్తి పాదాలవైపు చూసింది.

లూజుగా వున్న తెల్లటి ప్యాంట్ పాదాల్ని పూర్తిగా కప్పేస్తుంది.

(మిగతా 19వ పేజీలో)

**(9వ పేజీ తరువాయి)**

పాదాలు సరిగ్గా కన్పించడం లేదు.

'ఇప్పుడేం చెయ్యాలి? ముందు ఇక్కడనుంచి తొందరగా వెళ్ళిపోవాలి' మనసులో అనుకొని వెనక్కి తిరిగింది. కాని అడుగులు ముందుకు పడలేదు. కాళ్ళు సన్నగా కంపిస్తున్నాయి. ఎందుకో సంధేహమొచ్చి వెనక్కి తిరిగింది.

చలిగాలి బలంగా వీచింది. ఆ వ్యక్తి పొడవైన జుత్తు అటూఇటు ఎగురుతోంది. ఇంకా నవ్వుతూనే వున్నాడు. ముఖం మరికాస్త భయంకరంగా మారింది.

చటుక్కున ముఖాన్ని తిప్పేసుకొని వడివడిగా అడుగులు ముందుకు వేసింది. వెనక అడుగులు చప్పుడు మళ్ళీ విన్పిస్తోంది.

'అంటే ఆ వ్యక్తి మళ్ళీ తనని ఫాలో చేస్తున్నాడు... నిజంగా అతడు మనిషేనా?... కాదు... ఇంతసేపు తనని ఫాలో అవుతున్నాడు. పైగా భయంకరంగా వున్నాడు. తెల్లటి బట్టలు కూడా వేసుకున్నాడు... ఆ పళ్ళు ఎంత భయంకరంగా వున్నాయి. డెఫినెట్‌గా అతడు మనిషి కాదు...' సమగ్ర ఏదేదో ఆలోచిస్తోంది.

నడకలో వేగాన్ని మాత్రం తగ్గించలేదు.

వెనక అడుగుల చప్పుడు విన్పిస్తూనే వుంది.

కొంతసేపటి తర్వాత దూరంగా కొద్దిపాటి వెలుతురు కన్పించింది.

'హమ్మయ్య! దుర్గాపురం దగ్గరవుతోంది. మరికొద్ది సేపు నడిస్తే చాలు గండం గట్టెక్కినట్టే' ఆమెకి ధైర్యం కలిగింది. చిన్నగా నిట్టూర్చి వడివడిగా నడవసాగింది.

సమగ్ర వెనక అడుగుల చప్పుడు సడెన్‌గా ఆగిపోయింది.

ఆమె చెవులు రిక్కించింది.

అడుగుల చప్పుడు అస్పష్టంగా కూడా విన్పించడం లేదు.

'ఏమైయుంటుంది? ఆ వ్యక్తి మధ్యలో ఆగిపోయాడా లేక ఇంకేమైనా చెయ్యబోతున్నాడా?' ఆమె గుండె వేగం మళ్ళీ హెచ్చింది.

ఊపిరి బిగపెట్టి వెనక్కి తిరిగింది.

వెనక ఎవ్వరూ కన్పించలేదు.

'అరే ఇంతలోనే ఆ వ్యక్తి ఎలా మాయమయ్యాడు?' ఆమెకంతా అయోమయంగా వుంది.

రకరకాలుగా ఆలోచిస్తూ తల త్రిప్పి ప్రక్కకి చూసింది.

నెత్తిమీద బాంబ్ పడినట్టు తుళ్ళిపడింది.

ఎదురుగా కన్పించిన దృశ్యం ఆమె వెన్నులో ఒణుకు పుట్టించింది.

రోడ్డుకి ఎడమవైపు పెద్ద చింత చెట్టు ఒకటుంది.

ఆ చింత చెట్టు కొమ్మల్ని పట్టుకొని ఆ వ్యక్తి వ్రేలాడుతున్నాడు.

బలంగా వీస్తున్న గాలికి ఆ వ్యక్తి ధరించిన తెల్లటి బట్టలు రెపరెపలాడుతున్నాయి. పొడవైన జుట్టు ముఖంమీద పడి వ్రేలాడుతోంది. ఆ జుట్టు సందుల్లోంచి కళ్ళు మాత్రం ఎర్రగా మెరుస్తున్నాయి. ఆ కళ్ళు సమగ్రని తదేకంగా చూస్తున్నాయి.

సమగ్రకి కాళ్లు చేతులు ఒణకడం మొదలుపెట్టాయి.

ముఖమంతా చెమటతో తడిసిపోయింది.

చెట్టుకొమ్మల్ని పట్టుకొని వ్రేలాడుతున్న ఆ వ్యక్తి భయంకరంగా నవ్వడం మొదలుపెట్టాడు. ఆ నవ్వు గాలిలో తేలుతూ వచ్చి సమగ్ర చెవుల్లో మార్మోగుతోంది.

'సందేహం లేదు, ఇతడు మనిషి కాదు... ఖచ్చితంగా దెయ్యమే!' ఆమె మెదడు మొద్దుబారిపోతోంది.

ఇంతలో చెట్టుకొమ్మల్ని పట్టుకొని గాల్లో వ్రేలాడుతున్న ఆ వ్యక్తి నవ్వడం ఆపేసి భయంకరంగా కేకపెట్టి సమగ్రవైపు దూకాడు.

ఊహించని ఆ సంఘటనకి సమగ్ర జడుసుకొని కెవ్వున కేక పెట్టింది. మరునిమిషమే స్పృహ కోల్పోయి అచేతనంగా కుప్పకూలిపోయింది.

ఆ తర్వాత ఏం జరిగిందో ఆమెకి తెలీదు.

* * *

కళ్ళు విప్పేసరికి అందంగా నవ్వుతున్న అత్తయ్య ముఖం కన్పించింది. ఓ క్షణం సమగ్రకేమీ అర్థంకాలేదు. 'అసలు తనకేమైంది? తనెక్కడుంది?' ఆలోచనలు ఆమె మెదడుని వేడెక్కిస్తున్నాయి.



**ఏంటమ్మా సమగ్రా అలా అయిపోయావ్? ఓహో... వీణ్ని చూసి భయపడుతున్నావా? వీడు మన పనివాడమ్మా, పేరు చిన్నదాసు. ఎంతకాలం నించో మన దగ్గర చాలా నమ్మకంగా పనిచేస్తున్నాడు. కాకపోతే వీడి పొడవాటి జులపాలు, ఎర్రటి కళ్ళు చూస్తే కొత్తవాళ్ళు ఎవరికైనా భయం కలగడం సహజమే అనుకో.**

"ఏమ్మా సమా! ఎలా వుంది ఒంట్లో" అత్తయ్య పలకరింపుతో మెల్లమెల్లగా ఈ లోకంలోకి వచ్చింది. కొంతసేపటికి 'రాత్రి' జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటిగా జ్ఞాపకం వచ్చాయి.

చివరగా తను అత్తయ్య ఇంట్లోకి చేరిన విషయం స్పష్టంగా అర్థమైంది. బంధువులంతా ఒక్కొక్కరూ ఆమె మంచం చుట్టూ చేరారు.

"అత్తయ్యా! ఇంతకీ నీ ఆరోగ్యం ఎలా వుంది? ఆర్ యూ ఆల్ రైట్?" సడెన్‌గా తనొచ్చిన విషయం జ్ఞాపకమొచ్చి ప్రశ్నించింది సమగ్ర.

"అత్తయ్య ఆరోగ్యం సంగతి తర్వాత, ముందు నీ ఆరోగ్యం సంగతి చూస్కో తల్లీ! అసలే పెళ్ళి కావలసిన పిల్లని" తాతయ్య తల ఆప్యాయంగా నిమురుతూ చురక అంటించారు. సమగ్ర కాస్త సిగ్గుపడింది.

"నా ఆరోగ్యం ఒక్కరోజులో తగ్గేది కాదమ్మా! అప్పుడప్పుడూ తిరగబెడుతూ వుంటుంది. ఆ సంగతి అలా ఉంచు, అవును సమా! నువ్వు జంక్షన్‌కి వచ్చినట్టు ఒక్క ఫోన్‌కాల్ చేస్తే సరిపోయేది కదా! అంత దూరం నడుచుకుంటూ వచ్చావ్. అసలు నీకు నడకే అలవాటు లేదు. అందులోనూ ఇంత దూరం... రాత్రి స్పృహతప్పి పడిపోయిన నిన్ను బైక్ మీదొస్తున్న అప్పూ మావయ్య చూడబట్టి సరిపోయింది. లేదంటే రాత్రంతా అలా మంచులోనే పడివుండే దానివి. ఒక్కోసారి నీ ప్రవర్తన బొత్తిగా అర్థంకాదే" సమగ్ర చేతిని తన చేతిలోకి తీసుకొని నిమురుతూ అంది అత్తయ్య.

'అంటే తనకు నడక అలవాటు లేక కళ్ళు తిరిగి పడిపోయానని అందరూ అనుకుంటున్నారన్నమాట! పోనిలే అదే మంచిది, ఒకవేళ తను నిజం చెప్పినా ఎవరూ నమ్మరు, పైగా వెక్కిరిస్తారు' మనసులో అనుకొని కుదుటపడింది సమగ్ర.

"ఒరేయ్ చిన్నదాసూ! అమ్మాయికి అర్జెంటుగా హార్లిక్స్ పట్టుకొనిరా!" అత్తయ్య కేక విన్న మరుక్షణమే పనివాడు గ్లాసు నిండుగా హార్లిక్స్ తెచ్చి వినయంగా సమగ్రకి అందించాడు. హార్లిక్స్ తీసుకోడానికి మంచం మీద నుంచి లేవబోయిన సమగ్ర పనివాడి ముఖం చూసి ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టు అదిరిపడింది. ముఖంలో రక్తమంతా ఎవరో తోడేసినట్టు తెల్లగా పాలిపోయింది. అతడెవరో కాదు రాత్రి తనను ఫాలోఅయి భయపెట్టిన మనిషి. ఇంతకీ అతడు మనిషా లేక...?

సమగ్రకంతా అయోమయంగా వుంది.

కళ్ళల్లో భయం తాలూకా నీడలు మెల్లమెల్లగా చోటు చేసుకుంటున్నాయి.

"ఏంటమ్మా సమగ్రా అలా అయిపోయావ్? ఓహో... వీణ్ని చూసి భయపడుతున్నావా? వీడు మన పనివాడమ్మా, పేరు చిన్నదాసు. ఎంతకాలం నించో మన దగ్గర చాలా నమ్మకంగా పనిచేస్తున్నాడు. కాకపోతే వీడి పొడవాటి జులపాలు, ఎర్రటి కళ్ళు చూస్తే కొత్త వాళ్ళు ఎవరికైనా భయం కలగడం సహజమే అనుకో. వీణ్ని నువ్వు బహుశా మొదటిసారి ఇదే చూడ్డం అనుకుంటా! అందుకే భయపడుతున్నావ్. అలా కనిపిస్తాడే గాని చాలా అమాయకుడమ్మా..." అత్తయ్య చెప్పుకుంటూ పోతుంటే సమగ్ర మెదడులో గూడుకట్టుకున్న అనుమానాలన్నీ ఒక్కొక్కటీ మంచులా కరిగిపోతున్నాయ్.

"... వీడికున్న ఒకే ఒక్క చెడ్డ అలవాటు తాగుడు. రాత్రయితే చాలు బాగా తాగేసి ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. ఒక్కోసారి తాగి ఏవేవో పిచ్చి చేష్టలు చేస్తుంటాడు. కొత్తవాళ్ళు వీడి చేష్టలు చూస్తే జడుసుకోవడం ఖాయం! మళ్ళీ తెల్లవారితే మన్ను తిన్న పాములా తయారవుతాడు. ఎన్నోసార్లు తాగుడు మానమని చెప్పి చూసాను, వింటేనా, వెధవ రాస్కెల్... అసలు అనాల్సింది వీణ్ని కాదు..." అత్తయ్య అలా నాన్‌స్టాప్‌గా మాట్లాడుకుంటూ పోతుంది.

అంటే తను ఊహించుకున్నదంతా నిజం కాదు. అత్తయ్య ఇంట్లో పనిచేసే ఒక పనివాడు తాగేసి ఏవో పిచ్చిచేష్టలు చేస్తే తను ఏవేవో ఊహించుకొని జడుసుకుంది. తనెందుకిలా పిరికిదానిలా మారిపోయింది? అసలు తను స్పృహ తప్పి రోడ్డుమీద పడిపోవడానికి అసలైన కారణం తెలిస్తే ఈ ఇంట్లో వాతావరణం ఎలా వుంటుంది? తనలాంటి ఫూల్... కాదు కాదు... టామ్ ఫూల్ ప్రపంచంలో ఇంకెవ్వరూ ఉండరేమో... ఛీ ఛీ... మంచం మీదనుంచి లేవడానికి మనస్కరించక సమగ్ర తిరిగి అలాగే పడుకొని భరింపశక్యం కాని సిగ్గుతో కళ్ళు గట్టిగా మూసుకుంది.

"అమ్మా సమగ్రా! ఏమైందమ్మా! ఎందుకలా పడుకున్నావ్?..." కంగారు పడుతూ అత్తయ్య అంటున్న మాటలు, "సమగ్రా! ఏమైందిరా?... అసలేమైందో చెప్పరా" అంటున్న ఎవరెవరి మాటలో చెవిలో పడుతున్నా సమగ్ర కళ్ళు మాత్రం విప్పలేదు.

'రాత్రి జరిగిన సంఘటనని, తన ఘనకార్యాన్ని మర్చిపోవడం అసలు ఈ జన్మకి సాధ్యమేనా'అని ఆలోచిస్తూ నిద్రపోవడానికి ప్రయత్నించింది.

అవతల ఆమెకేమైందోనని అంతా కంగారుగా అరుస్తూనే ఉన్నారు.

★